కలలు అందరూ కంటారు. కానీ, అందరి కలలూ ఒక్కలా వుండకూడదు. వాస్తవంలోలాగే కలల్లోనూ తరగతులుండక తప్పదేమో?

రమణ కారు పార్క్ చేసి, లాక్ చేసి నిలబడ్డాడు. సిగరెట్ వెలిగించి హుస్సేన్‌సాగర్ అవతల పొగలో గులాంకొట్టుకున్న కుర్రాడిలా అస్తమిస్తున్న సూర్యుణ్ణి చూస్తూ నిలబడ్డాడు. టాంక్ బండమీద కార్లు, స్కూటర్లు, ఆటోలు, డబుల్‌డక్కర్లు పరుగులు తీస్తున్నాయి.

రోజూ సాయంత్రం కారుతోవచ్చి అక్కడ నిలబడటం అతనికి అలవాటేం కాదు. డ్యూటీ!

సాయంత్రం కరిగిపోయి చీకటి ముసురుకొని నియాన్‌లైట్ల కాంతిలో టాంక్‌బండ్ క్రొత్త అందం సంతరించుకొని కన్నెప్రాయం నుంచి ప్రౌఢతనం పొందేదాకా వుండి ఇంటికెళ్ళడం రమణ డ్యూటీ.

ప్రతిరోజూ, క్రొత్త దంపతులు చెట్టాపట్టాలేసుకుని పల్లీలు, పాప్‌కారన్, ఐస్‌క్రీమ్ తింటూ, ఒకరి కళ్ళల్లోకి మరొకరు ఆశగాచూస్తూ, ఆశలు కలబోసుకుని, అనురాగాన్ని ఆప్యాయతను పెనవేసుకుని, టాంక్‌బండ్ ఈ చివరనుంచి, ఆ చివర దాకా తిరుగుతుంటే రమణ చూస్తూ వుంటాడు. ఒక్కోసారి అలాంటి అదృష్టం తనెందుకు పొందలేకపోతున్నాడో, ఆ అర్హత ఎందుకు పొందలేకపోయ్యాడో తలచుకుంటూ, సిగరెట్ల మీద సిగరెట్లు తగలేస్తూ నిలబడతాడు.

వృద్ధాప్యంలో అడుగిడుతున్న వాళ్ళు, నిరుద్యోగులు, రికామీగా తిరిగేవాళ్ళు హైదరాబాదు చూసేందుకు వచ్చిన యాత్రికులు విద్యార్థులు, ఆడుకునేందుకు వచ్చే చిన్నచిన్న పిల్లలు జీవితంలో ఉండేందుకు చోటులేని మనుషులు, కుష్టువాళ్ళు, బ్రతుకుతెరువు కోసం తిరిగే మనుషులు- ఇలాటి చిన్న ప్రపంచాన్ని రమణ అక్కడ చూస్తుంటాడు.

ఆ ప్రక్కనేవున్న ఇందిరా పార్క్‌లో అక్కడక్కడా ప్రేమికులు కొండొకచో కాలక్షేపానికి వచ్చే ముసలివాళ్ళు మినహా, అంతా బోసిగా వుంటుంది. పార్క్ చుట్టు ప్రక్కలవున్న ఖాళీస్థలంలో మేడలు రోజు రోజుకో రకంగా రూపాలు సంతరించుకుంటున్నాయి.

రమణ హైదరాబాదు వచ్చి పదేళ్ళు దాటింది ఈ పదేళ్ళలో ఎన్నో మార్పులు




జరిగాయి. విశాలంగా, ప్రశాంతంగా వుండే రోడ్లు యిరుకుగా తయారైనాయి. రోడ్డు ప్రక్కవున్న పెద్ద వృక్షాలు నేలకొరిగి వాటిస్థానే ఎలక్ట్రికల్ స్తంభాలు వెలిశాయి. గుడిశలు, ఖాళీ స్థలాలు కనుమరుగై వింత వింత రూపాల్లో ఆకారాల్లో మిద్దెలు మేడలు వచ్చాయి. క్రొత్త నీరు రోజు రోజుకూ వస్తూనే వుంది. ప్రశాంతంగా, మత్తుగావుండే నగరం గందరగోళంగా తయారవుతున్నది.

రమణ అంతా చూస్తూనే వున్నాడు. మార్పులేనిది, రానిదీ అతని జీవితం! రోజులు గడిచేకొద్దీ అరణ్యంలా నగరం పెరిగిపోయి, తను కుంచించుకుపోతున్నానేమోనన్న భావన రమణకు కలుగుతున్నది.

రమణ చేసేది డ్రైవరు ఉద్యోగం.

ఇప్పటికి అతను నడుపుతున్న 'పద్మిని' ఆరోది. కారు నడుపుతుంటే ఆలోచనలు రావు. కానీ అతని ఉద్యోగం కారు నడపటమే అయినా, కారు నడిపే కాలం తక్కువ. క్లబ్‌లదగర, బార్ల ప్రక్కన, సినిమాహాళ్ళదగ్గర, వెయిట్ చేసే కాలమే ఎక్కువ. జీవితంలో వెయిటింగ్ ఎక్కువైంది కారుగల యజమాని జీవితాన్ని అనుభవిస్తూ ఆనందిస్తుంటే రమణ కాపలా కుక్కలా వెయిట్ చేస్తున్నాడు. దేనికి? జవాబు దొరకని ప్రశ్న అది.

రాత్రి ప్రవేశించింది.

బేగంపేటనుంచి సిగ్నల్‌లైట్ పరిభ్రమిస్తోంది! నక్షత్రాలు నేలరాలినట్లు వూరంతా దీపాలు!

రమణ మరో సిగరెట్ కాల్చాడు.

ఎదురుగా, ఓ అందమైన అమ్మాయి అతన్నే చూస్తూ నిలబడి వుంది.

రమణ ఓ క్షణకాలం ఆమెనే చూస్తూ ఇది కలా భ్రమా అన్న మీమాంసలో వున్నాడు.

"రోజూ చూస్తున్నాను. మీరు ఏదో ఆలోచిస్తూ ఎక్కడో చూస్తూ వుంటారు. ధైర్యంచేసి ఇవ్వాళ పలకరించాను!" అంది ఆ అమ్మాయి నవ్వుతూ.




రమణ సిగ్గుపడ్డాడు. సిగరెట్ క్రింద పడేసి బూటుతో తొక్కేసి "మీ పేరు" అనడిగాడు.

"భ్రమర.... చాలా పాత పేరు. భ్రమరాంబ నాకు నచ్చక భ్రమర అని మార్చుకున్నాను" భ్రమర కారు దగ్గరగా వచ్చి అన్నది.

"నా పేరు రమణ...."

"చాలా బాగుంది మీ కారులా" భ్రమర కారుని ఆప్యాయంగా ముట్టుకుంది.

ఆ సాయంత్రం మల్లెలు విరిసినట్లు, వెన్నెల కురిసినట్లుగా వుంది రమణకు.

భ్రమర నవ్వుతూ సీతాకోక చిలుకలా

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనా పరేవారిరంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మమువలె నుండి పోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితముగా పంపెదము. వెంటనే వ్రాయండి. **Address :**

Jeevan kalyan (B.D-8)
P.O. KATRI SARAI (GAYA)

శుభవార్త

డాక్టర్లకు సాధ్యముకాక వదిలి వేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. లావుపాటివారు సన్నగను, బలహీనులను బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్ఠు, బొల్లి, క్యాన్సరు సంతానంలేని వారు కూడా శ్రీ యోగిగారి కాయకల్ప చికిత్సవలన సంపూర్ణ ఫలితము పొందగలరు. ఈ చికిత్స వలన దేహములోని అన్నివ్యాధులు తొలగి పోవుటయేగాక నూతన యవ్వనము కలుగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రు. 4-00లు యం.ఓ. పంపవలయును.

మేనేజర్,

శ్రీ యోగాశ్రమ్,

పెదవాల్తేరు P.O.,

విశాఖపట్టణము-17.

## వర్ధమాన క్రీడాకారులు

# కుమారి కె. లూసీప్రమీల



కొద్ది రోజులక్రితం గుంటూరులో నిర్వహించిన అఖిల భారత గ్రామీణ క్రీడోత్సవాలలో తెలుగువారికి ప్రథమ స్వర్ణపతకం కుమారి కె. లూసీ ప్రమీల హైజంప్‌లో సాధించినప్పుడు 10 వేలకు పైగా బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో వున్న స్త్రీ. పురుషులు, బాలబాలికలు పొందిన ఆనందం వర్ణనాతీతం. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ జట్టుకు సారధ్యం వహించిన లూసీ ప్రమీల హైజంప్‌లో 1.40 మీ. ఎత్తు దూకి ఆంధ్రప్రదేశ్‌కు యీ పోటీలలో మొట్టమొదటి బంగారు పతకము గెల్చి ప్రజల, పత్రికల ప్రశంసలు పొందింది.

ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో యింటర్ మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థినియైన కుమారి కె. లూసీ ప్రమీల క్రీడాకారుల కుటుంబానికి చెందినది. తండ్రి కె. మోహన్ విక్టర్ అందించిన ప్రోత్సాహం అనేక విజయాలు సాధించుటకు ఆమెకు తోడ్పడింది. పన్నెండవ ఏట నుంచి తన పాఠశాల పోటీలలో అన్నిట గెల్చి ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకొనేది. 1978 లో పశ్చిమ గోదావరిజిల్లా అంతర్ పాఠశాల క్రీడా పోటీలలో గ్రిగ్ స్మారక బంగారు పతకము కైవసం చేసుకొన్నది. గతసంవత్సరము సెయింట్ థెరీసా మహిళా కళాశాల ఛాంపియన్ 100, 200, 400 మీ. పరుగు హర్డిల్స్, హైజంప్‌లలో "ఫస్ట్"

బందరులో జరిగిన రాష్ట్రస్థాయి గ్రామీణ ఎథెలటిక్ పోటీలలో 200మీ. పరుగుపందెంలో 27.6 సెకనులలో పరుగెత్తి ప్రథమస్థానము. 1.40 మీ. ఎత్తుదూకి హైజంప్‌లో మొదటి స్థానము. 100 మీ. పరుగుపందెములో తృతీయ స్థానము. లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానము గెల్చి "ఛాంపియన్‌షిప్" గెల్చినది.

ఈమెను మంచి ఎథెలెట్‌గా రూపొందించిన ఘనత రాష్ట్ర క్రీడామండలి కోచ్ కె. వెంకటేశ్వరరావు. సెయింట్ థెరీసా కళాశాల వ్యాయామ ఉపాధ్యాయినులకు లభించుతుంది.

క్రీడా పోటీలలో అనేక పతకములు సాధించిన లూసీ ప్రమీల చదువులోకూడా "బెస్ట్" ఆటలకై చదువు నిర్లక్ష్యము చేయక ప్రతిఏడు ప్యాసుఅయి అందరికి ఆదర్శ విద్యార్థినిగా వున్నది.

ఇంకా అవకాశములు, ప్రోత్సాహము మంచి తర్ఫీదు లభిస్తే తెలుగువారు గర్వించ తగిన జాతీయ క్రీడాకారిణిగా రూపొందగలదు.

— మంకరమ్

---

వుంది. చేతిలోవున్న ఎర్ర రంగు ప్లాస్టిక్ బుట్ట మినహాయిస్తే, భ్రమర దివినుంచి భువికి దిగివచ్చిన సోఫియా లారెన్, మర్లిన్‌మన్రో లలా అనిపించింది రమణకు. అంతేకాదు. అంతటి సుందరి చనువుగావచ్చి చెంతచేరిపలకరించటం రమణకు యెంతో సంతోషాన్నిచ్చింది.

"అలావెళ్ళి 'టీ' త్రాగుదాం" అన్నాడు డుగు ముందుకు వేసి!

భ్రమర కారు దగ్గర నుంచి రాలేదు. ఆమె మొహంలో ఫిలమెంట్ తెగిపోయింది.

"నే రాను!"

"మరి -"

"కార్లో కూర్చుందాం"

గొప్పింటి పిల్ల. కోరితే, కాదనగల ధైర్యం రమణకు లేదు. డోర్ తెరిస్తే, అమాంతం వెళ్ళి స్టీరింగ్ దగ్గర కూర్చుంది భ్రమర. రమణ సిగ్గుపడుతూ వెళ్ళి పక్కన కూర్చున్నాడు.

"అద్దాలు మూసెయ్యి. రొద. మనం హాయిగా మాట్లాడుకోవచ్చు."

చిన్న ప్రపంచం. అందులో ఆ ఇద్దరూ.

"మీరెక్కడుంటారు!"

"నేనా.... బంజారా హిల్స్.... మా యింట్లోంచిచూస్తే ఫలక్‌నుమా ప్యాలెస్, బిర్లామందిర్ అన్నీ కనబడతాయి."

"మీరు రోజూ వస్తారా?"

"ఆహా! మా అమ్మకు ఆరోగ్యం బాగో లేదు. అందుకని రోజూ వస్తా ఆమెతో-బోర్, ఆమె మాటాడదు. నేను ఆమెతోపాటు ఖైదీలా కూర్చోవాలి!"

భ్రమర స్టీరింగ్ త్రిప్పుతూ, స్విచ్‌లు నొక్కుతూ కూర్చుంది.

రమణకు ఆమె చిలిపితనం, కారులో ఎక్కిన సంబరం చూస్తుంటే అనుమానం వచ్చింది "ఈమె గొప్పింటి బిడ్డేనా?" అని!

భ్రమర అది కనిపెట్టింది "మా ఇంట్లో రెండు కార్లున్నాయి. ఒకటి ఇంపాలా! మరోటి చెవర్లెట్. అయితే ఏం నన్ను ముట్టుకోనివ్వరు?"

"ఎందుకని!"

"మా అక్క, కారు డ్రైవింగ్ నేర్చుకుంటూ, యాక్సిడెంట్‌లో మరణించింది!"

క్షణం విచారం, ఆమె మొహాన్ని క్రమ్ముకుంది.

కలవారిపిల్ల, అలా విచారంగా వుండటం రమణకు బాధ కలిగించింది ఏం చెయ్యాలో తోచలేదు. రేడియో ఆన్ చేశాడు. జనరంజని మొదలైంది.

"కాసేపు అలా తిరుగుదామా".

"ఉహూ" అని తలొంచుకుని "నాకిక్కడే బావుంది. మంచి పాటలొస్తున్నాయి. పైగా యిక్కడ ఎంతో ఏకాంతంగా వుంది" అంది భ్రమర.

"మీ యింట్లో ఎవరెవరుంటారు?"

భ్రమర రమణ కళ్ళల్లోకి చూసింది. ఆ కళ్ళల్లో, చూపులో ఆర్ద్రత, నిస్సహాయత వుంది.

"నేనూ, మా అమ్మ యిద్దరమే! లంకంత యిల్లు. సమాధిలా వుంటుంది. అమ్మకు ఆయాసం మాట్లాడదు. ఆ యింట్లో నాతో మాట్లాడేవాళ్ళెవ్వరూ లేరు. కొంచెంసేపు గార్డెన్‌లో తిరుగుతా! పూజ చేస్తా, రేడియో వింటా! అయినా ప్రొద్దు గూకదు."

"పోనీ పెళ్ళి చేసుకోక పొయ్యారా?

రమణవేపు వారకంటితో చూసి, గుండెలోతులు శోధించి "చేసుకుంటా! కానీ మా అన్నయ్య ఫారెన్‌నుంచి రావాలి. అప్పుడు పెళ్ళి" అని నవ్వింది. ఆ నవ్వులో మోహం వుంది. రమణ ఆమె ముహం చూసి ముగ్ధుడైనాడు. ఆలోచనలో పడ్డాడు.

భ్రమర చక్కగా, అందంగా లేత తమలపాకులా వుంది. తనంటే అభిమానముంది. ఈ అనురాగ లత. పుష్పించి ఫలిస్తే?.... రమణ ఆలోచనలు మంద్ర మంద్రంగా సాగాయి. తీగెలు తొడిగి, ఆశలు పుష్పించాయి.

"ఎందుకూ నవ్వుతున్నారు?"

రమణ జవాబు చెప్పలేదు.

"నా మాటలు నమ్మశక్యంగా లేవా?"

**7,000 VACANCIES FOR CLERKS**
**and 800 Vacancies for Stenos CENTRAL GOVT**
**STAFF SELECTION COMMISSION EXAMINATIONS**

కనీస అర్హత :- Matriculation OR S.S.C or Degree.
వయస్సు :-18-25 సం॥ (S.C/S.T/Govt. Servantsకు సడలింపు)
పై ఖాళీలను భర్తీ చేయుటకు కేంద్రప్రభుత్వమువారిచే Applications కోరబడుచున్నవి. Written exams అన్నిముఖ్యకేంద్రాలలో జరుగును. South Region office Madras.
పై ప్రభుత్వపరీక్షకు మా కళాశాలయందు మంచిఅనుభవంగల Lecturersచే పై పరీక్ష విధానం ననుసరించి Postal మూలముగా శిక్షణ పొందవచ్చును.
పై ఉద్యోగముల పూర్తి వివరములు Exams Application Forms & Details మా కళాశాల యందు లభించును. రు. 3/- M.O. లేక Postal Order పంపి క్రింది అడ్రసు నుండి పొందవచ్చును.
గమనిక:—Examsకు మద్రాసు Centre వారికి ఉచిత Hostel వసతి.

Principal,
**TECHNICAL EXAMINATIONS TRAINING COLLEGE,**
(Govt. Regd)
P.H. Road, Koyambedu, MADRAS - 602 102

"వనితా జ్యోతి" చదవండి!

ఊరగాయలకు అమూల్యమైన నూనెలు
అగ్‌మార్కు కాబడిన
**A.S. బ్రాండ్ పప్పు నూనె**
**మేన్షన్ బ్రాండ్ నువ్వుల నూనె**
ఊరగాయలను మెత్తబడనీయవు. బూజు పట్టనీయవు.
చాలాకాలము నిల్వయుండును. అమితముగ రుచిని కలుగజేయును
16, 4, 2 కేజీల డబ్బాలలో ప్యాకింగ్ చేయబడుచున్నవి.
ఇండియన్ గవర్నమెంట్ వారి అగ్‌మార్కు సీలును గమనించి కొనుడు.
డిపోలు : * డా. ఉళక్కి స్ట్రీట్, తెనాలి, ఫోన్: 150
* 1-8-166, రాజా మొదలియార్ స్ట్రీట్, కళాసిగుడ, సికింద్రాబాద్, ఫోన్: 76160
బళ్ళారి, గుంతకల్, విజయవాడ, ఒంగోలు, మద్రాసు, నంద్యాల, బరంపురం, కలకత్తా, జెంషెడ్‌పూర్, నాగపూర్ లలో మా ఏజెంట్లు కలరు.
Manufacturers — స్థాపితం : 1910
**అంబటి సుబ్బన్న & కో., సామర్లకోట**
ఇండియాలోకెల్లా పెద్ద అగ్‌మార్కు వంటనూనె ఆయిలు ప్యాకర్సు

## వెయ్యేళ్ళ తెలుగు పద్యం

వాలారున్ కొనగోళ్ళ నీవలసతన్ వాయించుచో నాటకున్
మేలంబైన విపంచి నిన్న మొదలున్ నీ వంటమిన్ జేసి, ఆ
యాలాపంబె యవేళ పల్కెడు ప్రభాతాయాత వాతాహతా
లోల త్తంత్రుల మేళవించగదవే! లోలాక్షి దేశాక్షి కిన్!

— అల్లసాని పెద్దన

అందమైన కొనగోళ్ళతో. కొంచెం అలసట చెందినా, నాట రాగానికి శ్రుతి చేసి వాయించిన వీణ నిన్నటినుంచీ నువు తాకకపోవడంతో, యీ ప్రభాత వాయువుల స్పర్శ సోకి అదే రాగాన్ని యీ వేళకాని వేళ ఆలాపిస్తోంది ఆ రాగాన్ని మార్చి. దేశాక్షి రాగానికి తగినట్లుగా వీణ తంత్రుల్ని సవరించుకోవా!

ప్రవరుడు వరూధిని కోరికను తిరస్కరించి తన ఊరికి వెళ్ళిపోయాడు. ఆమె అతనిమీద విరహంతో దిగులుపడుతూ దిన చర్యల్ని పాటించలేదు. ఆమె బాధను పోగొట్టి మామూలు ధోరణికి తేవాలనే ఆలోచనతో చెలికత్తెలు అలా అన్నారు. ఏ వేళలో ఏ రాగం వాయిస్తే సముచితంగా వుంటుందీ అన్న సంగీత సంప్రదాయాన్ని తెలుపడంతోపాటు యింకో విశేషముంది యిందులో.

దేవతలంతా నిత్యయౌవనులనే మాట అట్లుంచినా, వరూధిని తొలియౌవనంలో వున్నట్లు వూహించాడు పెద్దన. తొలి యౌవనం ప్రభాతం లాంటిది. సహజంగా ఆ యౌవనోత్సాహంలో పొరపాట్లు జరుగుతాయి. ఆ ప్రవరున్ని నీకై నీవు కోరి ప్రయాసపడటం అలాంటి పొరపాటే! నీ రూపానికి, నీ యౌవన సమయానికీ తగినట్లుగా ఆ పొరపాటును దిద్దుకోవాలి సుమా, అన్న హితోక్తి యిది.

హృదయాన్ని వీణకూ, కోరికకు రాగాన్నీ సంకేతంచేసి నీ హృదయ వీణలోని కోరికల రాగాన్ని వయస్సుకీ, మనస్సుకీ తగినట్లుగా శ్రుతి చెయ్యి — అప్పుడు జీవితం రసవంతంగా వుంటుందన్న అంతరార్థంతో, అపురూపమైన పద్యం చెప్పాడు అల్లసాని పెద్దన. సంగీత వాయిద్యపరంగా వుండటమేగాక, పద్యమే ఒక వాయిద్యమై మనోహరంగా మ్రోగింది.

పెద్దన ప్రబంధయుగానికి పెద్దన్న. "ఆంధ్ర కవితా పితామహ" అని రాయలచేత పిలిపించుకుని, ఆయన చేత పల్లకీ మోయించుకున్న కవి!

— శ్రుతి

భ్రమర కోపంచూసి రమణ నవ్వుకున్నాడు.

"సరే అయితే! రాండి. ఇప్పుడు మా యింటికెడదాం!"

భ్రమర కారు దిగి నిలబడ్డది ప్లాస్టిక్ బుట్ట పట్టుకుని!

రమణకు ఏం చెయ్యాలో తోచలేదు. కారు తీసుకువెడితే యజమాని ఏమంటాడో! కారు వదిలేసి వెళ్ళడం యెలా?

"భ్రమరాంబగారూ...."

"నన్నలా పిలవకండి మీ రెంతో మంచివారని మీతో మాటలు కలిపా! కానీ యిలా అవమానిస్తారని తెలిస్తే రోజూలా దూరం నించే చూసి వెళ్ళేదాన్ని."

"క్షమించండి"

"మా యింటి కొస్తారా!"

"తప్పకుండా! కానీ ఇప్పుడు కాదు!"

"కాదు ఇప్పుడే వెడదాం. కారులో ఎంతసేపు వెడతాం!"

రమణ ఆలోచించాడు. వెళ్ళకపోతే తనను డ్రైవరుగానే అంచనా వెయ్యవచ్చు. అప్పుడు ప్రేమలత వాడిపోవచ్చు. బంగారు కలలు కరిగి నీరైపోవచ్చు.

వెడితే కారు యజమాని కసురుకుంటాడు. లేదా ఉద్యోగం పీకేస్తాడు. మళ్ళీ కొన్నాళ్ళు రోడ్లమీద, ఆకలి!

"నేను మీ అంత గొప్పదాన్ని కాకపోవచ్చు. కానీ స్నేహితురాలిగా పిలుస్తున్నాను."

రమణ ధైర్యం చేశాడు. దగ్గరగా వెళ్ళి, ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని, మెల్లగా నొక్కి "సారీ! పదండి వెడదాం!" అన్నాడు,

మబ్బు విడిచిన ఎండలా భ్రమర మొహంలో దరహాసం వచ్చింది. చెంగున ఎగిరి కారులో కూర్చుంది.

కారు స్టార్ట్ చేస్తూ రమణ అడిగాడు, "మీ అమ్మకు చెప్పిరారా!" అని.

"ఇవ్వాళ మా అమ్మకు గుడ్ బై చెప్పాను." అంది భ్రమర.

నీళ్ళల్లో చేపపిల్లలా కారు కదిలింది. "సరోవర్" దగ్గర కొచ్చాక "ఇక్కడ కాఫీ త్రాగుదాం!" అంది భ్రమర. రమణ స్టీరింగు ఓ చేత్తో పట్టుకుని జేబు చూసుకున్నాడు యధాలాపంగా, ఐదు రూపాయలు ఓ విరిగిన సిగరెట్టు, నలిగిన కాగితాలు వున్నాయి.

కారు లాన్‌లో పార్క్‌చేసి లాక్ చేసి దిగాడు. భ్రమర గువ్వపిట్టలా వచ్చి రమణ చెయ్యి పట్టుకుంది. ఆ స్పర్శకు దేహమంతా గగుర్పొడిచింది. గుండెల్లో హాయి హుషారుగా గంతేసి, వళ్ళంతా మెరుపులా పాకింది.

ఆరుబయట టేబుల్ దగ్గర కూర్చున్నారు.

జీతం వచ్చేందుకు ఇంకా వారముంది. ఐదు రూపాయల్తో గడపాలి. కారు ఓనరు ఉత్త వెధవ. అరిచి గీపెట్టినా డబ్బులివ్వడు అదే త్రాగటానికి, ముండలకు ఎడంచేత్తో వందలు తీసి ఖర్చుపెడతాడు. ఏఖిటో వెధవ ప్రపంచం అనుకున్నాడు రమణ.

బేరర్ వచ్చి నిలబడ్డాడు. "రెండు కాఫీ" అని చెప్పి పంపాడు రమణ. బేరర్ వెళ్ళాక భ్రమరతో అన్నాడు- "ఇప్పుడు టిఫిన్ చెయ్యడం నా కలవాటులేదు."

"నాకూ అంతే!" అని భ్రమర, ఆ ప్రక్క టేబుల్ దగ్గర పిల్లలు తింటున్న ఐస్‌క్రీంవేపు చూసింది.

కాఫీ త్రాగి బిల్ తెచ్చిన ట్రేలో ఐదు రూపాయలు పడేశాడు రమణ ఘరానాగా!

బేరర్ కదల్లేదు. ఐదు రూపాయలను శల్యపరీక్షచేసి "మధ్యలో చినిగింది చెల్లదు సార్" అన్నాడు.

రమణకు చెమటలు పోశాయి. భ్రమర వేపు చూశాడు. భ్రమర నవ్వి, లేచి వెళ్ళింది అక్కణ్ణుంచి!

రమణకేం చెయ్యాలో తోచలేదు. బేరర్ చాలా అసహనంగా నిలబడ్డాడు.

"బేరర్! వున్నదదొక్కటే" అన్నాడు గొంతులో దైన్యం కినబడకుండా.

బేరర్ రమణను తేరిపార చూసి నోటు తీసుకువెళ్ళాడు. రమణ విరిగిన సిగరెట్ తీసి నటిన చెమట తుడుచుకుని. "ఛీ! వెధవ జన్మ" అనుకున్నాడు. త్రాగినకాఫీ వికారపెట్టింది. శీతాంక్రితం కలిగిన ఆనందం. అనుభూతి మాయమైనాయి. ఆలస్యం అయినకొద్దీ యజమానిరూపం అగ్నిగోళాల లాంటికళ్ళు. రోజూ నోరు విప్పితే వచ్చే బూతులు. పనివాళ్ళంటే గల అసహనం గుర్తుకొచ్చేస్తున్నాయి. "బంజారా హిల్స్" వెళ్ళి వచ్చేసరికి మరో అరగంట అవుతుంది. అప్పటికి యజమాని "డీల్" ఇచ్చి బయటపడి. కారు. డ్రైవరూ కనబడకపోతే మాటలు "తిట్ల'తోనే మొదలెడతాడు.

బేరర్ ఇచ్చిన డబ్బు లెక్క చూడకుండా జేబులో వేసుకుని కారు దగ్గరికి వెళ్ళాడు.

భ్రమర పాన్ డబ్బా దగ్గర్నుంచి చప్పట్లుకొట్టి పిలిచింది. వెళ్ళాడు రమణ.

"ఇక్కడ పాన్ చాలా బావుంది మీరూ తీసుకోండి" అంది భ్రమర.

తీసుకున్నాడు పాన్. దాంతోపాటు సిగరెట్ పెట్టె! రెండురూపాయలు ఇచ్చేసి వచ్చాడు

కారు బయలుదేరింది

"అవునూ! చక్కని కారుంది. వస్తున్నుంది. మరి ఆ వెధవ సిగరెట్లు కాలుస్తారేం?"

"నాకివే యిష్టం!"

"ఏమో బాబూ! మా ఇంట్లో పనివాళ్ళు కాలుస్తారీ సిగరెట్లు. మా అమ్మకీ వాసన పడదు. చూసే తిడుతుంది."

"మరి మీరో?"

"మీరు కూడా మరే బ్రాండ్ అయినా కాల్చండి! ప్లీజ్" భ్రమర రమణమీద వాలిపోయి చొక్కా. గుండీలు లెక్కబెడుతూ. గోముగా అంది.

రమణ. ఆమె తల నూనె వాసన ఆస్వాదించి హాయిగా ఫీలయ్యాడు.

విశాలమైన తారు రోడ్డు. పందిరి వేసినట్లు రోడ్డుకిరువైపులా చెట్లు నిర్మానుష్యం, పైగా నిశ్శబ్దంగా, త్రాగినవాడిలా వుంది బంజారా హిల్స్.

భ్రమర దారి చూపుతుంటే. కారు పోనిచ్చాడు.

ఓ పెద్ద యినుపగేటు. గేటుదగ్గర గూర్ఖా. దాటాక పూలతోట. తోటలోంచి కొంతదూరం వెళ్ళాక పోర్టికో.

కారు ఆపి రమణ. భ్రమర దిగారు.


## ఋణం

వ్యాపారాభివృద్ధికోసం ఆకర్షణీయమైన షరతులమీద భవనం. వ్యాపారం షాపులు. భూములు. థియేటర్లు. లిమిటెడ్ కంపెనీలు. పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆ పైన ఋణం లభించును.

వ్రాయండి లేదా సంప్రదించండి. ఫోను: 395126

SUPREME CORPORATION (BANKERS)
F-15 "EVEREST" 7th Floor, Near Famous cine laboratory,
Tardeo Road, BOMBAY-400 034

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో

## తెల్ల మచ్చల వైద్యం

వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి



తెల్ల మచ్చల నుండి విముక్తి పొందిన వేలకొలది రోగులు నుండి ప్రశంసలు అందినవి. ఇది అంత ప్రశంసలు పొందడానికి కారణం ఏమిటంటే ట్రీట్‌మెంట్ మొదలవ్వగానే మచ్చల యొక్క రంగు మారిపోవడం మొదలవుతుంది. మరియు క్రమంగా చర్మం యొక్క రంగు వస్తూ ఉంటుంది. ఒక్కసారి సేవించిన తరువాత ఇది ఎంత బాగా పనిచేస్తుందో చూడండి. నిరాశ చెందిన వేలకొలది రోగులు ఈ చెడు జబ్బు నుండి విముక్తి పొందారు ఇంకా పొందుతూ ఉన్నారు. ప్రచారం కోసం ఒక ప్యాకెట్ మందుని ఉచితంగా ఇస్తూ ఉన్నాం. మీరు అనేక విధాలుగా నిరాశ చెంది ఉంటారు ఒక్కసారి వాడి చూడండి. ఎక్కడెక్కడ మచ్చలున్నాయో ఎంత పెద్దవో లేదా ఎన్ని రోజుల నుండి ఉన్నాయో మొదలయిన వివరాలను వ్రాయండి.

ఈ వైద్యంకోసం మందును ఎవరైనా చేయవచ్చును విశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొదలెట్టండి. BHARAT AYURVEDASHRAM P. O. KATRI SARAI (GAYA)

## ఎనభై రోజుల కాయకల్ప చికిత్స

1964 సంవత్సరమందు నేను డింగీ జ్వరముతో కొంత కాలము బాధపడినాను, జ్వరము తగ్గిన తదుపరి కీళ్ళ నొప్పులు ప్రారంభించినవి. ఈ నొప్పుల వలన యే వస్తువులను చేతితో పట్టుకోలేక, తిన్నగా నడవలేక బాధపడుచుండెడిదానను. దీనికితోడు దేహము పెరగటము ప్రారంభించినది. దేహము స్థూలమైన కొలది నొప్పులు పెరుగుతూవచ్చినవి. ఏమాత్రము చల్లగాలి తగిలినా, తలపోటు ప్రారంభించి, చెవిపోటు వచ్చి నిద్రపట్టక బాధపడుచుండెడి దానను. ఇందులకు చాలామంది డాక్టర్లు దగ్గర వైద్యము చేయించుకున్నా లాభము లేకపోయినది. ఈ బాధలకుతోడు నడిచేటప్పుడు బ్యాలన్సు కాపాడుకోలేక తరుచు తూలిపడిపోవుచుండెడిదానను. అందువలన ఒకసారి చెయ్యి విరిగినది. మరొకసారి కాలు విరిగినది. ఆంగ్లవైద్యులు సీలలువేసి కట్టుకట్టి బాగు చేసినారు. కాని నడవాలంటే ఎప్పుడు పడతానో అని భయముగా వుండెది.

ఈ స్థితిలో విశాఖపట్నంలోని పెదవాల్తేరు నందలి శ్రీయోగాశ్రమములో చేరి ఎనభై రోజులు కాయకల్ప చికిత్స పొందినాను. చికిత్స ప్రారంభించే ముందు నా బరువు 63 కేజీలు. చికిత్స తరువాత బరువు 51 కేజీలు. అనగా నాకు 12 కేజీలు బరువు తగ్గినది. దీనితోపాటు నా బాధలన్నియూ తొలగిపోయి సుఖముగా వున్నాను. మరియు ఇప్పుడు తూలుడు లేకుండా ఎంత దూరమైనా ఆనందంగా నడవగలుగుచున్నాను. ఇట్లు,

మద్దూరి వెంకటలక్ష్మి,
W/o. శ్రీ మద్దూరి నాగభూషణరావు, అడ్వకేట్.
46-11-33 దానవాయిపేట, రాజమండ్రి.

ఉత్తరప్రదేశ్‌లో స్థిరపడి. వోవెన్ ఆర్ట్ ఇనోవేషన్స్ ఎగుమతి వ్యాపారంలో నెలకు రు. 2 వేల పైబడి రాబడివున్న 26 సం. 5'-8" ఎత్తు గల, ఎర్రటి అంగమైన, బి.ఎస్.సి. చదివిన కమ్మ యువకుడికి హిందీ, ఇంగ్లీషు బాగా వచ్చిన కళాభిరుచిగల ఉత్సాహవంతురాలైన, అందమైన కమ్మ వధువు కావాలి. కట్నం అక్కర్లేదు. ఫోటోతో వివరాలు, శ్రీ కె. ఎస్. రామారావు, క్రియేటివ్ కమర్షియల్స్, గాంధీనగర్, విజయవాడ—520 003 కు పంపగోర్తాం.

వార్తలకు, వ్యాఖ్యలకు
"ఆంధ్ర జ్యోతి"
దిన పత్రికనే చదవండి.

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్
వివాహము వాయిదా వేయవసరంలేదు. హస్త ప్రయోగం, వరముల బలహీనత, శీఘ్ర స్ఖలనములకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా చికిత్స కలదు.
రాపూస్ క్లినిక్,
టి.బి. రోడ్. తెనాలి. ఫోన్ : 700, 1010.

SUVARNA

REGD.
వాడండి ముఖ్యంగా అలస్యమైనవి.
SEALED PACKING 10 & 14 TABLETS AVAILABLE AT ALL CHEMISTS
Mfrs: SEENU & CO. MADRAS-21

రెండు కుక్కలు తెల్లగా మంచు ముద్దల్లా పులిపిల్లల్లా వున్నవి. వచ్చి భ్రమరను ఆప్యాయంగా తాకాయి.

"ఇది టామీ, అది జానీ" పరిచయం చేసింది భ్రమర.

ఇద్దరూ లోపలకెళ్లారు గ్లాస్ స్ప్రింగ్ డోరు తీసుకువెడితే పెద్ద హాలు హాలుకు సరిపడ్డ గులాబీరంగు తివాచీ. మంచు ముద్దల్లా లైట్లు. ఓ గోడమీద నవాబుల డ్రస్‌తో, ఓ పెయింటింగ్. "అది మా డాడీ" అంది భ్రమర!

హాలు దాటి మెట్లెక్కి మేడమీదికెడితే అక్కడో ఎయిర్ కండిషన్ రూం. అందమైన సోఫాసెట్. ప్రక్కనే డ్రస్సింగ్ టేబుల్. దానికెదురుగా ఫోంబెడ్!

"ఇది మా మమ్మీ గది."

రమణకు స్వర్గలోకంలోకి వచ్చి నట్లుంది."

"కూర్చో!"

"లేదు వెడతాను!" రమణ టైం చూసుకున్నాడు.

"ప్లీజ్! డ్రింక్స్ తెస్తాను!" భ్రమర చెంగున ఎగురుతూ వెళ్ళింది.

రమణ సోఫాలో కూర్చున్నాడు. చిన్నగా సోఫాలో కదిలాడు. మత్తుగా. గమ్మత్తుగా. స్ప్రింగ్ కదిలి, అలలమీద తేలుతున్నట్లు అనిపించింది.

తన గుడ్డలు. అవతారం అద్దంలో చూసుకున్నాడు. పాత టెరిలిన్ చొక్కా చంకల్లో చిరిగింది. అయ్యగారు దయతో యిచ్చిన కాకీ ప్యాంట్‌కు గుండీలు లేవు. మొహమంతా జిడ్డోడుతూ వుంది. రాజ్య భ్రష్టుడైన రాజకుమారుడిలా వున్నానా అన్న అనుమానం వచ్చింది రమణకు!

"తనలో ఏం చూసి భ్రమర ముచ్చట పడ్డదో!" ఆలోచిస్తూ కూర్చున్నాడు రమణ.

చిన్నప్పుడు చదివిన వరూధినీ. ప్రవరాఖ్యుల కథ జ్ఞాపకం వచ్చింది. అంతే. తనను గొప్పవాడిగా భ్రమర భ్రమించి వలచిందేమో? కాకపోతే యింతడబ్బుగల పిల్ల తననుమోహించటం-సినిమాల్లో తప్ప జరుగని సంఘటన.

"ఎవరు నువ్వు?"

రమణ ఆ కంఠస్వరం విని, ఉలిక్కిపడి చూశాడు. చూసి, అప్రయత్నంగానే లేచాడు. ఆమె రూపంచూసి.

ఐదున్నర అడుగుల పాలరాతి విగ్రహం! రాజసీవి. చూపుల్లో శరీరంలో ఉట్టిపడుతున్నది. ఇలాంటి ఆడవాళ్ళు వుంటారని వినడమేగానీ, చూడటం ఇదే ప్రథమం!

## ఆశ

మనసులోని నీ రూపం
మమతల ప్రతిరూపమని
తలచి, తలచి
మురిసిపోతి నొకనాడు

నే తలచిన నీ హృదయం
కఠిన శిలా సదృశమని
తెలిసి తెలిసి
కుమిలిపోతి నినాడు

కఠిన శిలను కరిగించి
మమతల జలు కురిపించి
మనసు, మనసు పెనవేసి
బ్రతుకు బాట నడిచేము
ఒకరోజు

"హరవే"

"నేను...."

ఆమె రమణను పురుగులా చూసింది. గొంతెత్తి ఎవర్నో పిలవబోయింది. అంతలో భ్రమర ట్రేలో డ్రింక్స్‌తో వచ్చింది.

రమణ ఊపిరి పీల్చుకున్నాడు. ధైర్యం తెచ్చుకున్నాడు

భ్రమర చేతిలో ట్రే జారి క్రింద పడ్డది. భ్రమర నిస్తేజంతో రాతిబొమ్మలా నిలబడిపోయింది.

"ఓ! నీ నిర్వాకమా! అనాధవని తెచ్చి యింట్లో పెట్టుకుంటే ఇంతదాకా వచ్చావన్నమాట! డర్టీ క్రీచర్! శాయన్నా ఈ ముండని తన్ని బయటకు గెంటెయ్యి. క్షణం ఇంట్లో లేకపోతేపనివాళ్ళకు కొమ్ములొస్తాయి" పాలరాతిబొమ్మవెళ్ళిపోయింది.

రమణ భ్రమరవేపు క్షణంచూసి చిన్నగా నవ్వాడు. ఆ నవ్వులో జాలివుంది, నిస్పృహాయత వుంది. చెదరిన కలలు, చెరుపుకున్న ఆశలు. ఆశల అఖాతంలో కూలిపోయిన మానవుని శిధిలాలు వున్నాయి.

రమణ వెనుతిరిగి చూడకుండావెళ్ళాడు. కారు స్టార్ చేసుకుని వంకరగా పరమపద సోపానంలో పాము వాతలోపడ్డ పావులా బంజారాహిల్స్ దిగిపొయ్యాడు నిరాశతో.

అతని కళ్ళముందు భ్రమరరూపం కదులాడుతూనే వుంది! అయితే ఇప్పుడు భ్రమరానికి రెక్కలులేవు. అవి కాలిపొయ్యాయి ఆశల నిప్పులవేడికి!